

బడి గంట మోగింది





- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- స్కూల్స్‌కు చేరిన పుస్తకాలు, యూనిఫామ్స్
- ఈ యేడాది నుంచి షూ పంపిణీ
- 19 వరకు కొనసాగనున్న 'బడిబాట'

కరీంనగర్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆట..పాటలకు ఇక సెలవు... వేసవి సెలవులతో ఇన్నాళ్లు ఎంజాయ్ చేసిన పిల్లలు ఇకపై పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తెచ్చేందుకు ఇప్పటికే బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి బడీడు, బడిమానేసిన పిల్లలను, కొత్త విద్యార్థులను చేర్పించే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు.

మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో జూన్ 1 నుంచి ప్రవేశాలు తీసుకుంటున్నారు. ప్రతియేడు మాదిరిగానే ఈ విద్యా సంవత్సరంలోనూ జూన్ 11 వరకు వేసవి సెలవును ప్రకటించిన ప్రభుత్వం 12వ తేదీ గురువారం నుంచి పాఠశాలల పునః ప్రారంభించాలని ఆదేశించింది. దీంతో గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశా లలు ఉదయం 9 గంటల నుంచి 4.15 వరకు పని చేస్తాయి. ఉదయం 9.30 నుంచి సాయం త్రం 4.45 వరకు హైస్కూల్స్ పనివేళలుగా ప్రభుత్వం ప్రకటించింది.

నేడు అమ్మ ఆదర్శ పాఠశాల దినోత్సవం

- ఉదయం 7 నుంచి 9 గంటల వరకు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాఠశాలలను ఆకర్షణీయంగా అలంకరించాలి. పండుగ వాతావరణం కల్పించి విద్యార్థులతో కలిసి రంగోళి కార్యక్రమం నిర్వహించాలి.
- తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చేపట్టిన అభివృద్ధి పూర్తి చేసిన పనులపై అవగాహన కల్పించాలి.
- ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి.
- పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ నోట్ బక్కులు,యూనిఫామ్, షూస్ పంపిణీ చేయాలి.
- గత విద్యా సంవత్సరంలో చదువులు, క్రీడలు, ఇతర రంగాల్లో రాణించిన విద్యార్థుల విజయ గాథలను వివరించడంతోపాటు ఆ పిల్లల తల్లిదండ్రులను అభినందించాలి.

అమ్మ ఆదర్శ బడులకు నూతన హంగులు

రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలను ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు అవసరమైన నిర్మాణాలను చేపట్టింది. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి మిగిలిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చక్కటి ఫర్నీచర్, మంచి నీటి సౌకర్యం, విద్యుద్దీకరణ, భవనాల మరమ్మతులు, రంగులు వేయడం వంటి వాటితో నూతన హంగులతో భవనా లను తీర్చిదిద్దుతుంది. ఇప్పటికే ఈ పనులు జిల్లాలో దాదాపు పూర్త య్యాయి. జిల్లాలో 651 ప్రభుత్వ పాఠశాలలు, 11 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి.



కోతిరాంపూర్‌లో ముస్తాబైన ప్రభుత్వ పాఠశాల భవనం

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించండి..: కలెక్టర్ పమేలా సత్పతి



పిల్లలకు వడ్డిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి

కరీంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పిల్లల పరిపూర్ణ మానసిక వికాసానికి, శారీరక ఎదుగుదలకు అంగన్‌వాడీల్లో చేర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు పునఃప్రారంభమైన నేపథ్యంలో నగరంలోని కార్ఖానగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రారంభ వేడుకలను బుధవారం నిర్వహించారు. కొత్తగా అంగన్‌వాడీలో చేరిన పిల్లల తల్లిదండ్రులను కేంద్రాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అన్నారు. ఇక్కడ ఆటపాటలతో కూడిన విద్య అందిస్తారని తెలిపారు. ప్రతిరోజూ పోషకాలతో కూడిన ఆహారం అందించడంతోపాటు పిల్లల వయస్సుకు తగిన ఎత్తున, బరువుతో ఉండేలా చూస్తారన్నారు. ఈ నెల 17 వరకు అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం ద్వారా అంగన్ వాడీ కేంద్రాల్లో ఎక్కువ మంది చేరేలా చూడాలని ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ పునఃప్రారంభం సందర్భంగా పిల్లలకు ఎగ్ బిర్యానీ సిద్ధం చేయగా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు పిల్లలకు వడ్డించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సీడీపీవో సబిత పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఇసుక



జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు టోకెన్ పద్ధతిలో ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మైనింగ్, రెవెన్యూ, గృహ నిర్మాణ సంస్థ, ఇంజ నీరింగ్ అధికారులతో ప్రభుత్వ భవనాలు, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా విధానంపై సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లను మ్యాపింగ్ చేయాలని సూచించారు. లబ్ధిదారుడి గృహ నిర్మాణ అవసరాన్నిబట్టి టోకెన్లు జారీ చేయాలన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

కరీంనగర్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు బకాయి ఉన్నాయని, వెంటనే చెల్లించాలని కోరారు. ప్రతి కార్మికుడికి గుర్తింపుకార్డులు ఇవ్వాలని, కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె, డ్రెస్సులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల ఈశ్వర్, జిల్లా కోశాధికారి రవీందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కాశిపాక శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి వడ్లూరి లక్ష్మీనారాయణ, నాయకులు బండి సమ్మయ్య, ఉమ్మడి శ్రీకాంత్, పార్లపల్లి మల్లేష్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కెడెట్లకు ఆయుధాలపై అవగాహన



కెడెట్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామడుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదిర అల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో కెడెట్లకు పోలీస్ అధికారులు ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ఐ విశ్వజ, ఆర్ఎస్ఐ లక్ష్మీనారాయణ వివిధ ఆయుధాలు, వాటి తీరును కేడెట్లకు వివరించారు. అనంతరం దేశరాజుపల్లి సీహెచ్‌వో డాక్టర్ కల్వల భాగ్య వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

టీవీవీపీలో పోస్టులు భర్తీ చేయాలి

సుభాష్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ)లో హాస్పిటల్స్ క్యాడర్ స్ట్రెంత్‌ను అప్‌గ్రేడ్ చేసి వెంటనే పోస్టులు భర్తీ చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీఎంఈయూ) రాష్ట్ర కార్యదర్శి టి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన సిబ్బందికి పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. టీవీవీపీలో పనిచేస్తున్న ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల్లో ఉన్న ఉద్యోగులను కౌన్సెలింగ్ నిర్వహించి టీవీవీపీలోకి బదిలీ చేయాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో అర్హత ఉన్న ఉద్యోగులకు ఇన్ సర్వీస్ ట్రైనింగ్ ఇవ్వాలని, డీఎంఈ పరిధిలో ఉన్న ఆసుపత్రుల్లో అర్హులైన ఉద్యోగులకు వెంటనే పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. టీవీవీపీలో ఉద్యోగం చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెల ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల జీపీఎఫ్, టీజీఎల్ఐసీ ఖాతాల్లో మిస్సింగ్ క్రెడిట్స్ లేకుండా చూడాలన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
- ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు





యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులతో సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాల్లో నేర్చుకున్న వివిధ మెళకువలతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా క్రీడాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు బుధవారం సాయంత్రం ముగిశాయి. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వేసవిలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఈ వేసవిలో 16 క్రీడాం శాల్లో శిక్షణ శిబిరాలను నిర్వహించామన్నారు. దాదాపు 1500 మంది క్రీడాకారులు ఈ శిబిరాల్లో పాల్గొని శిక్షణ పొందారన్నారు.

శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ప్రతిరోజు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పౌష్టిక ఆహారాన్ని అందించామని తెలిపారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ శిబిరాల నిర్వహణలో సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యోగా క్రీడాకారులు చేసిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో మాజీ మేయర్లు సర్దార్ రవీందర్‌సింగ్, యాదగిరి సునీల్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కోశాధికారి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఎన్‌వైకే కో ఆర్డినేటర్ రాంబాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, పెటా టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, టీజీ పెటా అధ్యక్షుడు అంతటి శంకరయ్య, ప్రైవేట్ పెటా అధ్యక్ష, కార్యదర్శులు గౌతమ్ రెడ్డి, శ్రీధర్, యువజన అవార్డు గ్రహీత సత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు చేపట్టాలి



వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భగత్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని పాఠశాలలపై చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ అనుమతి లేకుండా నడుపు తున్న ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలన్నారు. పుస్తకాల పేరిట వ్యాపారాన్ని చేసే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, ఆసంపల్లి వినయ్ సాగర్, రాపర్తి వరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పారదర్శకంగా పునర్విభజన ప్రక్రియ

కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



కరీంనగర్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): డివిజన్ల పునర్విభజన మమ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డివిజన్ల విభజన ప్రక్రియలో ముసాయిదా ప్రకటన అనంతరం 243 అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం పునర్వి భజన ప్రక్రియను చేయాలని ఆదేశించారు. వచ్చిన అభ్యంతరాల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఎక్కడ పొరపాట్లు లేకుండా డివిజన్ల విభజన చేసి ఫైనల్ డ్రాఫ్ట్ తయారు చేయాలన్నారు. ఇంటి నంబర్లు తప్పి పోకకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్ల విభజనలో తప్పులు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా నిబద్ధతతో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. బొమ్మకల్, చింతకుంటలో కొనసాగుతున్న రెవెన్యూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వీధి దీపాల నిర్వహణలో ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈ యాదగిరి, ఏసీపీలు బషీర్, శ్రీధర్, వేణు, టీపీఎస్‌లు రాజు, సంధ్య, తేజస్విని, ఆర్‌వోలు భూమానందం పాల్గొన్నారు.



మగ్గిపోతున్న బాల్యం

- ప్రచారానికి పరిమితమైన బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం
- ఇటుకబట్టీలు, రెస్టారెంట్‌లు, హోటళ్లలో వెట్టిచాకిరి
- పేదరికంతో ఉజ్వల భవిష్యత్ నాశనం

6

రామడుగు పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ గౌస్ ఆలం

రామడుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రామడుగు పోలీస్ స్టేషన్‌ను బుధవారం సీపీ గౌస్ ఆలం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీకి ఎస్ఐ పూల మొక్క అందించి స్వాగతం పలికారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డులను సీపీ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేశారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాల న్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన సమాచారం సేకరించి నమోదు చేసుకోవాలని సీపీ ఆదేశించారు. రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, చొప్పదండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, రామడుగు ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధిలో సొంత ఎజెండా లేదు

● ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



అభినవ విద్యాతీర్థ సదనం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధిలో తన సొంత ఎజెండా అంటూ ఏమీ లేదని, శృంగేరీ పీఠాధిపతుల సలహాలు సూచనల మేరకే ఆలయాభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని శంకరమఠం వెనుక భాగంలో అనువంశిక అర్చకట్రస్ట్, బ్రహ్మణ నిత్యాన్నసత్రం వారి ఆధ్వర్యంలో అభినవ విద్యాతీర్థ సదనము నిర్మాణం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న క్షేత్రంలో సామాజిక సేవలో బ్రహ్మణుల కోసం ఒక వసతిగృహం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. బ్రహ్మణ వసతి గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం శృంగేరి పీఠాధిపతుల సలహాలు సూచనల మేరకే ముందుకు సాగుతున్నామని అన్నారు. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసకుని ఆలయాభివృద్ధికి ముందుకు సాగుతామన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.150 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధిపై త్వరలోనే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందరికీ వివరిస్తామని తెలిపారు. గతంలో ఆలయ చైర్మన్‌గా చేయడం, ప్రస్తుతం ఆలయ అభివృద్ధి చేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. ఆలయంలో అడుగు పెట్టడగానే ఒక ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడేలా అభివృద్ధి చేసుకుందామని వివరించారు. అఖిలపక్షంతో పాటుగా ప్రతిఒక్కరి సలహాలు, సూచనలు తీసుకుని ముందుకు సాగుతామని, రాజకీయాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా రాజన్న ఆలయ అభివృద్ధిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మణ నిత్యాన్నదాన సత్రం గౌరవఅధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మధు రాదకిషన్, ఈశ్వరగారి నరహరిశర్మ, బుడంగారి మహేష్, పురాణం రాము, మామిడిపల్లి వెంకటేశం, చంద్రగిర శరత్, గోపన్నగారి చందు, నమిలికొండ ఉమేష్ తదితరులు ఉన్నారు.

మానాల ఘాట్ రోడ్డులో టిప్పర్ బోల్తా



ఘాట్‌రోడ్డులో బోల్తా పడ్డ టిప్పర్

రుద్రంగి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం మానాల ఘాట్ రోడ్డులో కంకరతో వెళ్తున్న టిప్పర్ బుధవారం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానాల నుంచి రుద్రంగికి టిఎస్ 16 విబి 0789 నంబర్‌గల టిప్పర్ కంకర లోడ్‌తో వస్తుండగా రుద్రంగి మండలకేంద్రం శివారులోని మానాల ఘాట్ రోడ్డులో బ్రెక్‌లు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడినట్లు తెలిపారు. ఈ ప్రమాదంతో డ్రైవర్ బుజ్జి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం బీమ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి డ్రైవర్‌ను తరలించినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి బుధవారం అప్పగించారు. హుస్నాబాద్‌కు చెందిన పెండోత లక్ష్మీ, కరీంనగర్ భగత్ నగర్‌కు చెందిన వంశీకృష్ణ, కొత్తపల్లికి చెందిన కనుకం దామోదర్ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకొని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ ద్వారా ఫోన్‌లను గుర్తిం చిన పోలీసులు వాటిని రికవరీ చేశారు. ఫోన్‌లను ట్రేస్ చేయడంలో కృషిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

మగ్గిపోతున్న బాల్యం



- ప్రచారానికి పరిమితమైన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం
- ఇటుకబట్టీలు, రెస్టారెంట్, హోటళ్లలో వెట్టిచాకిరి
- పేదరికంతో ఉజ్వల భవిష్యత్ నాశనం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పేదరికంలో మగ్గుతున్న కొన్ని కుటుంబాల్లో పిల్లల భవి ష్యత్ అంధకారమవుతోంది. కుటుంబ పోషణ భారమవడం, చదివించడానికి తగిన ఆర్థికస్థోమత లేక పోవడంతో బడికి పంపాల్సిన పిల్లలను పనిలోకి పంపుతున్నారు. మరికొన్ని సంఘటనల్లో తల్లిదండ్రులు లేక అనాథలుగా మారిన పిల్లలు విధిలేని పరిస్థి తుల్లో బాలకార్మికులుగా మారుతున్నారు. హోటళ్ల, బార్‌లు, రెస్టారెంట్లు, మెకానిక్ షెడ్‌లు, ఇటుకబట్టీలు, స్టోన్‌క్రషర్, గ్రానైట్ క్వారీలు వంటి సంస్థల్లో బాలకార్మికులుగా పని చేస్తున్నారు. ఇటువంటి పిల్లల కు మంచి భవిష్యత్ అందించాలని ప్రభుత్వాలు చట్టాలను రూపొందించినా అమలుకు నోచుకోవడం లేదు. 18 ఏళ్లలోపు వయస్సు కలిగిన బాలబాలికలను పనిలో పెట్టుకోకూడదు. 15 నుంచి 18 ఏళ్ల వయస్సు పిల్లలను కొన్ని ప్రదేశాల్లో పనిచేసుకోవచ్చని, ప్రమాదకరమైన పనులు చేయకూడదని బాలలు, కౌమార దశ కార్మిక నిషేధం, నియంత్రణ చట్టం-2016 చెబుతున్నది.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం ప్రచారానికే పరిమితమైందని, కేవలం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం జూన్ 12న మాత్రమే సమావేశాలు ఏర్పాటు చేసి అనంతరం విస్మరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వేల బాలకార్మికులుగా పనిచేస్తూ అధికారుల తనిఖీల్లో పట్టుబడితే రూ.25 వేల రూపాయల చొప్పున ఆ సంస్థల యజమానులకు జరిమానా, జైలు శిక్ష విధించేలా చట్టంలో పొందుపరిచారు. జరిమానా రూపంలో వచ్చిన డబ్బులను ఆ బాలుడి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేలా పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా హోటళ్ల, బార్‌లు, రెస్టారెంట్లు, మెకానిక్ షెడ్‌లు, ఇటుకబట్టీలు, స్టోన్‌క్రషర్, గ్రానైట్ క్వారీలు వంటి సంస్థల్లో బాల కార్మికులు పనిచేస్తున్నారు.

2025 జనవరి నుంచి ఇప్పటి వరకు కరీంనగర్‌లోని చైల్డ్ హెల్ప్‌లైన్ సంస్థ- 1098 నిర్వహించిన తనిఖీల్లో 41 మంది, కార్మికశాఖ మరో 31 మంది బాలకార్మికులను గుర్తించారు. విచారణ చేపట్టి సదరు సంస్థల యజమానులకు జరిమానా విధించారు. గుర్తించిన బాలకార్మికుల్లో స్థానికులతోపాటు ఒరిస్సా, కేరళ, బీహార్ రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. కొందరు అనాథలను కరీంనగర్‌లోని ఓపెన్ షెల్టర్‌హోంలో, హాస్టల్‌లో చేర్పించారు. మిగతావారిని బడిలో చేర్పించారు. ఇంకొందరిని కౌన్సెలింగ్ అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

● పోస్టర్ ఆవిష్కరణ

ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్మికశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాద్, సహాయ కమిషనర్ వెంకట రమణ, ఏఎల్‌వో చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.



బాల కార్మికులు కనిపిస్తే సమాచారం అందించాలి

ఆవుల సంపత్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కోఆర్డినేటర్



జిల్లాలో బాల కార్మికులు కనపడితే టోల్‌ఫ్రీ నంబరు 1098 లేదా 9490881098కు సమాచారం అందించాలి. 14 సంవత్సరాలకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ఏ పనిలోనూ పెట్టుకోకూడదు. 15 నుంచి 18 ఏళ్ల వయస్సు పిల్లలను కొన్ని ప్రత్యేకమైన, ప్రమాదం కానీ పనులు చేయవచ్చు. పాఠశాలలో ఉన్న సమయంలో పిల్లలు పనిచేయరాదు. బాల, బాలికల ఉజ్వలమైన భవిష్యత్‌ను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు. అనాథ బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించి ఉచితంగా హాస్టల్ వసతి కల్పిస్తున్నాం.

రైస్ మిల్లుల్లో అధికారుల తనిఖీలు

మంథని, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపల్లి శ్రీలక్ష్మి మాడ్రన్ రైస్‌మిల్లు, దానికి అనుబంధంగా ఉన్న గంగాపురిలోని సత్యసాయి పారాబాయిల్డ్ రైస్‌మిల్లుల్లో సివిల్‌సప్లై ఎన్‌ఫోర్సుమెంట్, టాస్క్‌ఫోర్సు, రెవెన్యూ అధికారులబృందం బుధవారం తనిఖీలు చేశారు. కమీషనర్ ఆదేశాల మేరకు 2025 మార్చి 28న సివిల్ సప్లైకి సంబంధించి 2022-23 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం, బియ్యం నిల్వల, 2023-24సంవత్సరానికి గాను ఎఫ్‌సీఐకి సంబంధించిన ధాన్యం, బియ్య నిల్వలపై అధికారులు తనిఖీలు చేశారు. సూరయ్యపల్లిలోని శ్రీలక్ష్మి రైస్‌మిల్లులో తనిఖీ చేయగా నిల్వ ఉన్న ఎఫ్‌సీఐకి సంబంధించిన బియ్యం, ధాన్యం నిల్వలు తనిఖీచేశారు. నాటితనిఖీల్లో గంగాపురిలోని శ్రీసత్యసాయి రైస్‌మిల్లులో తనిఖీ చేయగా 41,365.27క్వింటాళ్ళ ధాన్యంకుగాను 9689.8 క్వింటాళ్ల మాత్రమే లెక్కలోకి వచ్చాయి. మిగితా 31675.47క్వింటాళ్ళ ధాన్యం తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈతనిఖీలపై సదురుమిల్లుల యజమాని హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆదేశాల మేరకు అధికారుల బృందం మిల్లుల్లో ఉన్న ధాన్యంనిల్వలపై మళ్లీతనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లోఅధికారుల బృందం పాల్గొంది.

మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ

జగిత్యాల క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని మంచినీళ్లబావి సమీపంలో ఉన్న మడేలేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని దొంగలు ఆలయ ప్రధానద్వారం తాళాలు పగులుగొట్టి గర్భగుడిలోకి చొరబడి అమ్మవారి మెడలో ఉన్న తులంనర బంగారం, 12తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆలయ అధ్యక్షుడు దేవరాజం ఇచ్చిన ఫిర్యాదుమేరకు టౌన్ ఎస్సై మన్మధరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇరిగేషన్ ఈఈ శ్రీధర్ అరెస్టు

- కరీంనగర్‌లో అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు
- హైదరాబాద్‌కు తరలింపు
- 5 బృందాలతో బంధువుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు
- పలు కీలక పత్రాలు, బ్యాంక్ డాక్యుమెంట్లు సీజ్



ఈఈ శ్రీధర్ బంధువుల ఇంటిలో తనిఖీలు చేపడుతున్న ఏసీబీ అధికారులు

కరీంనగర్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖ ఈఈ నూనె శ్రీధర్‌ను ఏసీబీ అధికారులు బుధవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేశారు. శ్రీధర్ కాళేశ్వరం ప్రాజెక్టు చొప్పదండి-8 డివిజన్‌లో ఈఈగా పనిచేస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని శ్రీధర్‌పై హైదరాబాద్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం అర్ధరాత్రి కరీంనగర్‌కు చేరుకున్న అధికారులు ఫోన్ లోకేషన్ ఆధారంగా బుధవారం వేకువజామున ఇంటికి వెళ్లి అరెస్టుచేసి హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీల ఆధ్వర్యంలో ఐదుబృందాలు కరీంనగర్‌లోని శ్రీధర్ ఇంటిలోనూ, భాగ్యనగర్‌లో ఉంటున్న అతడి మామ, డిగ్రీకళాశాల రిటైర్డ్‌ప్రిన్సిపాల్ ఉప్పు అంజయ్య ఇంటిలోనూ, చొప్పదండిలోని కాళేశ్వరం ప్రాజెక్టు-8 డివిజన్ కార్యాలయంలోనూ, మరి కొన్ని చోట్ల సోదాలు నిర్వహించారు. సోదాల్లో శ్రీధర్ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పలు డాక్యుమెంట్లు, ఇతర కీలకపత్రాలతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కొన్ని ఫైళ్ల సీజ్ చేసినట్లు తెలిసింది. ఇక్కడి అధికారులు మాత్రం కేసుకు సంబంధించిన వివరాలను చెప్పలేదు. హైదరాబాద్ అధికారులు వెల్లడిస్తారని తెలిపారు.

● 2016లో ఈఈగా పదోన్నతిపై చొప్పదండికి

వరంగల్‌జిల్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన శ్రీధర్ ఎస్ఆర్ ఎస్పీ ప్రాజెక్టులో భాగంగా ఎల్ఎండీలో గేజింగ్ డిపార్ట్‌మెంట్‌లో డీఈగా పనిచేశారు. 2016లో ఈఈగా పదోన్నతిపై చొప్పదండి-8 డివిజన్‌కు బదిలీ అయ్యారు. అప్పటినుంచి చొప్పదండిలోనే కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈగా విధులు నిర్వహిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభమైన వెంటనే ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు గేజింగ్ డిపార్ట్‌మెంట్‌తోపాటు మరికొన్ని డిపార్ట్‌మెంట్‌ల ఉద్యోగులను కాళేశ్వరం ప్రాజెక్టుకు బదిలీ చేశారు. అప్పటినుంచి చొప్పదండి డివిజన్ ఈఈగా పని చేస్తున్న శ్రీధర్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ జరిపిన ఏసీబీ అధికారులు చాలాకాలంగా అతడి కదలికలపై నిఘాపెట్టినట్లు తెలిసింది. ప్రస్తుతం ఏసీబీ అదుపులో ఉన్న ఈఈ శ్రీధర్‌ను హైదరాబాద్ కార్యాలయంలో విచారిస్తున్నారు. విచారణలో వెల్లడైన సమాచారంతో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మరికొందరు అధికారులపై దాడులు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

● నెలరోజుల్లో ఇద్దరు ఈఈల అరెస్టు

నీటిపారుదల శాఖలో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)లను నెల రోజుల వ్యవధిలో ఏసీబీ అధి కారులు అరెస్టు చేశారు. రాజన్న సిరిసిల్లజిల్లా నీటిపారుదలశాఖ ఈఈ ఎర్రంరెడ్డి అమరేందర్‌రెడ్డి మే9న ఒకకాంట్రాక్టర్ వద్ద 60వేల రూపాయలు లంచం డబ్బులు తీసుకుంటుండగా కరీంనగర్‌లో ఏసీబీఅధికారులు అరెస్టుచేసి కటకటాల్లోకి తరలించారు.

తాజాగా బుధవారం అదేశాఖకు చెందిన ఈఈ నూనె శ్రీధర్‌ను ఆదాయానికి మించి ఆస్తుల కేసులో కరీంనగర్‌లోని స్వగృహంలో అరెస్టు చేశారు.

బీరన్న ఆలయం ఎదుట ఆందోళన

హుజూరాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరన్న ఆలయం ఎదుట బుధవారం యాదవకులస్థులు ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీరన్న ఉత్సవాలను జరుపుకుండా మంటే కురుమ కులస్థులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కాగా గ్రామంలో శిథిలావస్థలో ఉన్న బీరన్నఆలయాన్ని పునఃనిర్మించామని, విగ్రహప్రతి ష్ఠాపన జరగకుండా ఉత్సవాలు జరపకూడదని కురుమ కులస్థులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై రెండుకులాల వారు పోలీసులను ఆశ్రయించారు. వేదపండితులు సూచనల మేరకు ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.



ఆలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యాదవ కులస్థులు

చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి

యైటింక్లయిన్‌కాలనీ, జూన 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గుర్తుతెలియని మహిళ బుధవారం మృతిచెందింది. ఆరు రోజుల క్రితం గోదావరి నది సమీపంలో అపస్మారక స్థితిలోపడిఉన్న మహిళను పోలీసులు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం సదరు మహిళ మృతిచెందింది. ఆచూకీ లేని కారణంగామహిళ మృతదేహాన్ని పోలీసులుమార్చురీలో భద్ర పరిచారు.

మస్కట్‌లో ఉరేసుకుని చందుర్తివాసి ఆత్మహత్య



గణేష్ (ఫైల్)

చందుర్తి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరిలో ఉపాధి కరువై మస్కట్ వెళ్లిన ఓ యువకుడు అక్కడ అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులకథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన కత్తి గణేష్(24)అనే యువకుడు మస్కట్ వెళ్లి వస్తున్నాడు. రెండు నెలల క్రితం చందుర్తికి వచ్చి మస్కట్ వెళ్లిన గణేష్ రూమ్‌లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మిత్రులు ఫోన్‌ద్వారా బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతు డి తల్లిదండ్రులు లక్ష్మి-మల్లేశం గతంలోనే అనారోగ్యంతో మృతిచెందారు.

ద్విచక్రవాహనం ఢీ.. చికిత్స పొందుతూ మృతి



దశరథం (ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లాల గ్రామానికి చెందిన కోడూరి దశరథం(59) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే... జిల్లెల గ్రామానికి చెందిన దశరథం నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చినఫిర్యాదుమేరకు ద్విచక్ర వాహన దారుడు రామచంద్రపురం గ్రామానికి చెందిన గంధం పరుశురాములపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

ట్రైనీ ఎస్సైని సర్వీస్ నుంచి తొలగించాలి

సుభాష్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో దళిత యువకుడిపై దాడి చేసిన ట్రైనీఎస్సై భార్గవ్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంకటి శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతనెల సైదాపూర్ మండలం సోమారం గ్రామ శివారులో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు బత్తుల మహేందర్ ఆపారని, అదే సమయంలో అతడికి ఫోను రావడంతో మాట్లాడుతుండగా ట్రైనీ ఎస్సై భార్గవ్ కొట్టాడని ఆరోపించారు. ఈవీడియో సోషల్ మీడియాలో కూడా వైరల్ అయ్యిందన్నారు. ట్రైనీ ఎస్సైకి సహకరించిన కానిస్టేబుళ్లపైనా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బౌత్ రాజేందర్‌రెడ్డి, పాక కుమార్, కల్వల రాజు, అరుణ్, మిసాగాల్ల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సంపన్నరైతు దేశానికి గర్వకారణం



మాట్లాడుతున్న జాతీయ మాంసకృతుల విభాగ డైరెక్టర్ డాక్టర్ బాబుడే

పాలకుర్తి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సంపన్న రైతు దేశానికి గర్వకారణం అని ఐసీఏఆర్, ఎన్ఎంఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌బీ బాబుడే పేర్కొన్నారు. పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రావ టు పంచాయతీ ఆవరణలో బుధవారం రైతులకు కేవీకే రామగిరి ఖిల్లా శాస్త్రవేత్తల బృందం వ్యవసాయ, అనుబంధ రంగాలపై అవగాహన కల్పించారు. పంట ఉత్పత్తి, నేలఆరోగ్యం, శాస్త్రీయవ్యవసాయ పద్ధతులు, సైన్స్‌ఆధారిత సలహాలు, వాతావరణ సూచనలు, పశు,మత్స్య, సాంకేతికతతో నడిచే వ్యవసాయ ప్రోత్సాహ పద్ధతులు, కేంద్ర సబ్సిడీవివరాలు, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, అగ్రిస్టాక్ (రైతు ఐడిలు), నమో డ్రోన్ దీదీ ద్వారా సాంకేతికతతో నడిచే వ్యవసాయంపై అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో రామగుండం ఏఎంసీ చైర్మన్ గడ్డం తిరుపతి, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ బస్వారెడ్డి, పౌల్ట్రీ డైరెక్టర్ డాక్టర్ కన్నకి, కెవికె హెడ్ డాక్టర్ ఎ. శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

వాగులను దోచేస్తున్నారు..

- అనుమతికి మించి ఇసుక తరలింపు
- పట్టించుకోని అధికారులు..



పదిర మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

ఎల్లారెడ్డిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలనే నిర్ణయం అక్రమార్కులకు వరంలా మారింది. ఇదే అదనుగా తీసుకున్న వ్యాపారులు ఇసుక దందాకు తెరలేపారు. అధికారికంగా కొంత ఇసుకకు అనుమతులు తీసుకుని అనధికారికంగా పెద్దఎత్తున తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణా లోపం రాజకీయ నాయకుల అండతో ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గుండారం, సింగారం, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లతిమ్మాపూర్, అక్కపల్లి, దుమాల, బండలింగంపల్లి, సింగారం, వెంకటాపూర్, కోరుట్లపేట, తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతు న్నాయి. వీటితోపాటు స్థానిక అవసరాల కోసం పదిర, వెంకటాపూర్, రాగట్లపల్లి, నారాయణపూర్ గ్రామాల శివారులోని మానేరు వాగు వద్ద ఇసుకరీచ్‌లకు ప్రభుత్వం అనుమతులను జారీ చేసింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలింపునకు రెవెన్యూ అధికారులు అనుమతి పత్రాలను అందిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇందిరమ్మ ఇళ్లకు సరఫరాచేయాల్సిన ఇసుకను అక్ర మార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. పెద్దఎత్తున ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

● డీడీ డబ్బులు అధికారికి.

మండలంలోని పదిర, వెంకటాపూర్, రాగట్లపల్లి, నారాయణపూర్ గ్రామాల శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలించేందుకు ప్రభుత్వం ఒక క్యూబిక్ మీటరుకు రూ.160 చొప్పున ఒక్కో ట్రాక్టర్‌కు రూ.480లు ప్రభుత్వానికి డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణానికి సంబంధించిన పనుల పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి జారీచేస్తే దానిని తహసీల్ కార్యాలయంలో సమర్పించాలి. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం డీడీ డబ్బులను మినహాయించింది. ప్రైవేటు అవసరాల కోసం ఒక రోజు ముందుగానే డబ్బులు చెల్లించిన డీడీతోపాటు ట్రాక్టర్ల నంబర్లు, డ్రైవర్ల ధ్రువీకరణ పత్రాలను అందించాలి. కానీ తహసీల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి అంతా తానే అన్నట్లు వ్యవహరిస్తూ ఇసుక తరలింపునకు ఎన్ని ట్రాక్టర్లు నడుస్తున్నాయో లెక్కగట్టి ఆగ్రామాల ట్రాక్టర్‌సంఘం అధ్యక్షుల ద్వారా తనకు నేరుగా ఫోన్‌పే చేయించుకుంటున్నారనేఆరోపణలున్నాయి.

● గ్రామాభివృద్ధి పేరిట వసూళ్లు

పలు గ్రామాల శివారులోని మానేరు వాగు ఆ గ్రామస్థులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కొందరు గ్రామాభివృద్ధి కమిటీ పేరిట వసూళ్ల పర్వానికి తెరదీశారు. గ్రామశివారులోని వాగువద్ద ప్రత్యేకంగా ఇద్దరు వ్యక్తులను నియమించారు. ఒక్కో ఇసుక ట్రిప్పుకు 100 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం గుర్తించిన ఇసుకరీచ్‌ల గ్రామాల్లో ప్రతి రోజు 20 వేల నుంచి 25 వేల రూపాయల ఆదాయం సమకూరుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

● ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

- సుజాత, తహసీల్దార్, ఎల్లారెడ్డిపేట



మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు పదిర, వెంకటాపూర్, రాగట్లపల్లి, నారాయణపూర్ గ్రామాలతో పాటు లబ్ధిదారులకు అనువైన వాగుల నుంచి ఇసుకకు అనుమతులిస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వానికి డీడీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రైవేటు అవసరాలకోసం ఇసుకకు ఒక్కో ట్రిప్పుకు 480 రూపాయల డీడీ తీయాలి. నేరుగా డీడీ డబ్బులు తమ కార్యాలయంలోని అధికారికి చెల్లిస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. ట్రాక్టర్ సంఘం, గ్రామాభివృద్ధి కమిటీల పేరిట డబ్బులు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలి. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

రోళ్లవాగు ప్రాజెక్టును సందర్శించిన అటవీ అధికారులు



రోళ్లవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బీర్‌పూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని రోళ్ల వాగు ప్రాజెక్టును ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ, నిర్మల్ జోన్ అటవీ అధికారి శర్వానంద బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. అటవీ శాఖ అనుమతులు లేక పనులు నిలిచిపోయాయని రెండు రోజుల క్రితం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌ఆఫ్‌ఫారెస్ట్ సువర్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై స్పందించిన ఆమె రోళ్ల వాగును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోళ్ళవాగు ప్రాజెక్టును సందర్శించిన అధికారులు అటవీ శాఖ అనుమతితో పాటు పర్యావరణ అనుమతులు తప్పనిసరి అని తెలియజేశారన్నారు. కవ్వాల్ ఫారెస్టు దగ్గరగా ఉన్న రోళ్లవాగు ప్రాజెక్టులో 800ఎకరాలకుపైగా అటవీప్రాంతం ముంపునకు గురవు తున్న సందర్భంగా ఢిల్లీలో ఉన్న అటవీశాఖ కార్యాలయం నుంచి అను మతులు తప్పనిసరని అధికారులు తెలిపినట్లు వివరించారు. గతంలోనే నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్‌ను కలిస్తే సానుకూలంగా స్పందించి ఢిల్లీలో అటవీ పర్యావరణ శాఖ అనుమతులు వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో రవి ప్రసాద్, ఇరిగేషన్ అధికారులు నారాయణ రెడ్డి, చక్రు నాయక్, నాయకులు నరేందర్, ప్రభాకర్, హరీష్, రైతులు తదితరులు ఉన్నారు.

14న ఉమ్మడి జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాక్రికెట్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 14న నిర్వహించనున్నట్లు జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆగమరావు, మురళీధర్‌రావు బుధవారం ప్రక టనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఉద యం 8 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 01-09-2006 తర్వాత జన్మించినవారై ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పదోతరగతి మెమో, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కేడీసీఏ నెట్స్‌లో హాజరుకావాలని సూచించారు.

సాహితీహృదిలో నిలువెత్తు రూపం



- హన్మాజీపేట నుంచి జ్ఞాన పీఠంపై 'సినారె'
- నేడు జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత సినారె వర్ధంతి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అలుపెరుగని సాహితీ కృషీవలుడు, జ్ఞానపీఠ మెక్కిన డాక్టర్ సి నారాయణరెడ్డి భౌతికంగా లేక పోయినా ఆయన అక్షరం పలకరిస్తోంది. పాటలు మదిని తాకుతూనే ఉన్నాయి. సాహితీవేత్తలు, అభి మానులు, కవులు, రచయితలు, సినారెతో ఉన్న అను బంధాలను నెమరువేసుకుంటున్నారు. 'ఊపిరాడ లేదు... ఉక్కపోస్తుంది.. ఏసీ గదిలో.. కారణం తెలిసి పోయింది. కవిత రాయలేదు ఇవాలా... రాస్తూరాస్తూ పోతాను... సిర ఇంకిపోయే వరకు.. అంటూ 72ఏళ్లుగా కవిత్వాన్ని, 58ఏళ్లుగా ఆనాటి ఏకవీర చిత్రం నుంచి ఈనాటి అరుంధతి దాకా పాటలను అందిస్తూ..



హన్మాజీపేటలో సినారె ఇల్లు

'మాటకు దండం పెడతా... పాటకూ దండం పెడ తా... మాటను, పాటను నమ్మిన మనిషికీ దండం పెడతా...' అంటూ పాట, మాట నా రెండు కళ్లు.. అని చెప్పుకునే హన్మజీపేట ముద్దుబిడ్డ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి 87 వసంతాలు అడుగుపెట్టే క్రమంలోనే జూన్ 12, 2017 అక్షర శిఖ రమై నింగికెగిసి ఏడేళ్లు గడిచిపోయాయి. అక్షర శిఖ రం... విశ్వంభరుడు... గుబాళించే పాటలు ఎప్పుడూ సాహిత్య జీవనదిగా సాగిపోయిన సినారెకు గురు వారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కవులు, రచయితలు, సాహితీ సంస్థలు సాహిత్య కార్యక్రమాలతో నివాళులు తెలపడానికి సిద్ధమయ్యారు. తాను తిరిగాడిన నేల రాజన్న సిరిసిల్ల జిల్లా జ్ఞాపకాల్లో మిగిలిపోగా.. మానే రు ఇసుక తిన్నెలు.. మూలవాగులో ప్రవహించిన పాటలను పాడుకుంటూనే ఉన్నారు.

ఎన్నో సత్కారాలు.. ఎన్నెన్నో అవార్డులు..

డాక్టర్ సి నారాయణరెడ్డి అందుకోని సత్కారాలు లేవు. పొందని అవార్డులు లేవు. అంతేకాకుండా సినా రె చేతుల మీదుగా ఎంతో మంది అవార్డులు అందుకో వాలని, సత్కరించుకోవాలని ఆరాట పడిన సందర్భా లు ఎన్నో ఉన్నాయి. ఉత్తర అమెరికాలో ఏడుసార్లు పర్యటించగా, తానా, ఆటా సంస్థల కార్యక్రమాలకు వెళ్లి వచ్చారు. సోవియట్ రష్యా, మలేషియా, మారిష స్‌లో కూడా సినారె అక్షర అడుగులు నడిచాయి. అత్యుత్తమైన జ్ఞానపీఠంపైకి నిలువెత్తు అక్షరమై నిలి చిన సినారె అందుకున్న అవార్డులు సత్కారాలు ఎన్నో ఉన్నాయి 1974లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాజ్యలక్ష్మి అవార్డు, సోవియట్ ల్యాండ్ అవార్డు, మోహినిదాస్, కోమారన్, 1988లో అత్యున్నత జ్ఞాన పీఠ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాహి త్య అకాడమీ పురస్కారం, భారతీయ భాషా పరిషత్ పురస్కారం, పద్మశ్రీ పురస్కారం, పద్మభూషణ్ పురస్కారం, ఉత్తమ పాటల రచయితగా నంది పురస్కారం, డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం. ఆంధ్ర, కాకతీయ, డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్, మీరట్ నాగార్జున విశ్వవిద్యా లయాల నుంచి గౌరవ డాక్టరేట్లను పొందారు. వివిధ ప్రక్రి యల్లో 95కి పైగా పుస్తకాలు రాయగా, సినిమాలకు 3500లకు పైగా పాటలు రాశారు. సినారె సాహి త్యంపై పలు కోణాల్లో తొమ్మిది మంది పీహెచ్‌డీలు చేసి డాక్టరేట్ అందుకోగా, 19మంది ఎంఫిల్ చేశారు. సినారె గ్రంథాలు పలు భాషాల్లోకి అనువాదం జరిగాయి. సినారె హిందీ, ఉర్దూ భాషాల్లో కూడా కవితలు రాశారు.

కుటుంబ నేపథ్యం...

వేములవాడ మండలం హన్మాజీపేట గ్రామంలో జులై 29, 1931లో సినారె జన్మిం చారు. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు సినారె. కుటుంబపరంగా భూస్వామ్య వారసత్వమైన ఆ మనస్తత్వం ఇంట్లో ఎవరికి లేదు. తండ్రి నాగలి పట్టి దున్నేవాడు. సినారె మూడో తరగతి వరకు ఊళ్లోనే చదువుకున్నా నాలుగోవ తర గతికి సిరిసిల్ల మానేరు ఒడ్డుకు చేరుకు న్నారు. పొరు గూరికి పంపించి చదివించడం తల్లి బుచ్చమ్మకు ఇష్టం లేకపోయినా తండ్రి మల్లారెడ్డి ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివారు. సినారెను తండ్రి తహసీ ల్ కార్యాలయంలో క్లర్క్, నాయబ్, తహసీల్దార్‌గా చూడాలని కోరుకున్నాడు. తండ్రి ఇష్టానికి మించి తహసీల్దార్ కాక అంతర్జాతీ య స్థాయికి ఎదిగాడు.

మానేరు ఇసుక తిన్నెలపై అక్షర ప్రవాహం..

సిరిసిల్ల మానేరు తీరాన ప్రాథమిక విద్యను, కరీం నగర్‌లో ఉన్నత పాఠశాల విద్యను అభ్యసించి పై చదువులకు హైదరాబాద్‌కు చేరుకున్నారు. చాదర్ ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియేట్, ఉస్మానియాలో బీఏ ఉర్దూ మీడియంలోనే పూర్తిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచే తెలుగు సాహిత్యంలో పోస్టు గ్రాడ్యుయేట్, డాక్టరేట్ పొందారు. శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయంలో అనేక గ్రంథాలను చదివారు. 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని'... అంటూ సినీ కళా పరిశ్రమలో తన కలం నుంచి జాలువారిన తొలిపాటకు 58 ఏళ్లు నిండాయి. పల్లె నాకు పాటను ఇచ్చింది. పట్నం నాకు మాటను ఇచ్చింది అంటూ డాక్టర్ సినారె పాటకు మాటకు ఉన్న అనుబంధాన్ని చెబుతూ మట్టి వాసనలు వినిపించే జానపదాలు.. రాగాలతో పాటల చెలికాడుగా నిలిచిపోయాడు.



హన్మాజీపేటలో సినారె స్మృతివనం

బస్‌పాస్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి



వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

భగత్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బస్ పాస్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ రాజుకు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు బుధవారం వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ మాటా డుతూ రాష్ట్రంలో విద్యార్థుల బస్ పాస్ చార్జీలను పెంచుతూ తీసుకున్న నిర్ణ యాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కేశబోయిన రాముయాదవ్, నగర నాయ కులు పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొ న్నారు.

హుజూరాబాద్: రాష్ట్రంలో ఆర్టీసీ.. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, రోహిత్ అన్నా రు. బుధవారం హుజూరాబాద్ డిపోమేనే జర్ రవీంద్రనాథ్‌కు వినతిపత్రం అందజే శారు. రాష్ట్రంలో 10లక్షలకు పైగా పేద, మధ్యతరగతి, గ్రామీణప్రాంత విద్యార్థులపై పెను భారం పడుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ బస్‌పాస్ చార్జీలను పెంచడం సరికాదన్నారు. వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో నాయకులు గణేష్, రాజు తదిత రులు పాల్గొన్నారు.

'అడ్లూరి'కి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకు చెందిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురు కొత్త మంత్రులకు శాఖలు కేటాయిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జీవో నంబర్ 131 ద్వారా ఉత్తర్వులు వెలువడ్డాయి. బీఆర్‌ఎస్ హయాంలో జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజక వర్గానికి చెందిన కొప్పుల ఈశ్వర్ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే జగిత్యాల జిల్లాకు మరోమారు సంక్షేమ శాఖ దక్కడం, అందులోనూ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిత్యం వహిస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు దక్కడం విశేషం. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ మంత్రిగా కొప్పుల ఈశ్వర్ వ్యవహరించగా, ప్రస్తుతం అడ్లూరి లక్ష్మణ్‌కు అదే సంక్షేమ శాఖ కేటాయించడం యాదృచ్ఛికమైనప్పటికీ ఒకే నియోజకవర్గానికి రెండు పర్యాయాలు మంత్రి పదవి, అవే శాఖల కేటాయింపు జరగడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈనెల 8వ తేదీన మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పదవీ ప్రమాణ స్వీకారం చేయగా బుధవారం శాఖలు కేటాయించారు.



అడ్లూరి లక్ష్మణ్ కుమార్

చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలి

కరీంనగర్ అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ పరిధిలోని కరీం నగర్ శిశుగృహంలో పెరుగుతున్న 11నెలల ఆడ శిశువును బుధవారం తమిళనాడుకు చెందిన పిల్లలు లేని దంపతులకు దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇందుకోసం జిల్లా పరిషత్ కార్యాలయ భవనంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జిల్లా సంక్షేమఅధికారి సరస్వతి, డీసీపీవో పర్వీన్, పీవో తిరుపతి, శిశుగృహం మేనేజర్ తేజస్వి, రాజేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దంపతులకు శిశువును దత్తత ఇస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

సుభాష్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సౌక ర్యాలు కల్పించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలోమాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వపాఠశాలలు, కళాశాలల్లో సౌక ర్యాలు లేవనిఆరోపించారు. ప్రైవేటు పాఠ శాలలు, కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించడంలేదని మండిపడ్డారు. విద్యను వ్యాపారంగామార్చి అధికఫీజులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభు త్వం వెంటనే తనిఖీలు చేపట్టాలని, నిబంధ నలు పాటించని పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, రాష్ట్రఉపాధ్యక్షుడు కారుకూరి శ్రీని వాస్, రాష్ట్ర మహిళాఉపాధ్యక్షురాలు మీరి యా, నగరఅధ్యక్షురాలు స్వాతి, మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు కవిత, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు బైరి పద్మ పాల్గొన్నారు.

యూరియా ఉత్పత్తికి సన్నద్ధం

- ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో లైట్ అప్
- 13నాటికి అమ్మోనియా ఉత్పత్తి
- తెలంగాణ రైతాంగానికి ఊరట

కోల్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)లో వార్షిక మరమ్మతులు పూర్తయి లైట్ అప్ జరిగింది. రెండు రోజుల క్రితం ఈ ప్రక్రియను ప్రారంభిం చారు. 13నాటికి అమ్మోనియా ఉత్పత్తి ప్రారంభం కానున్నది. యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్న తెలంగాణకు ఆర్‌ఎఫ్‌సీఎల్ వార్షిక మరమ్మతులు పూర్తి చేసుకుని ఉత్పత్తి దశలోకి ప్రవేశపెట్టడం ఊరటనిచ్చినట్లయ్యింది. కీలకమైన హెచ్‌టీఆర్‌ను బైపాస్ చేసి మరమ్మ తులు పూర్తి చేశారు. 3500టన్నుల సామర్థ్యం గల ఆర్‌ఎఫ్ సీఎల్ హీట్ ట్రాన్స్‌ఫర్ రిఫార్మర్ (హెచ్‌టీఆర్)ను బైపాస్ చేయడం వల్ల కొంత ఉత్పత్తి తగ్గనున్నది. గత ఏడాది ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు 5లక్షల టన్నులయూరియా సరఫరా జరిగింది. ఈ సారి కూడా అదేస్థాయిలో సరఫరా చేసేందుకు కసరత్తు చేస్తు న్నారు. తెలంగాణ రాష్ట్ర అవసరాల్లో 30శాతంకు పైగా ఆర్‌ఎఫ్‌సీఎలే తీర్చుతుంది. హెచ్‌టీఆర్ బైపాస్‌తో రోజుకు 300నుంచి 350టన్నుల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. సరాసరిరోజుకు 3500టన్నుల ఉత్పత్తి జరుగ నున్నది. తెలంగాణలో యూరియా నిల్వలు తక్కువగా ఉండడం, కేంద్రం సరిపడా సరఫరా చేయడంలేదు. ఇదే క్రమంలో ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో మే నెల6వతేదిన ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపివేశారు. జూన్6న ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించు కున్నా సాధ్యపడలేదు. మూడు రోజుల ఆలస్యంతో లైట్‌అప్ చేశారు. 14తరువాత యూరి యా ఉత్పత్తి జరిగే అవకాశం ఉంది.కేంద్రప్రభుత్వం కూడా తెలంగాణలో యూరియా కొరతదృష్ట్యా ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా సరఫరా చేయాలని ఆదేశాలు జారీచేసిం ది. ఈ క్రమంలో రైల్వేశాఖతో కూడా రేకుల విషయం లోఆర్‌ఎఫ్‌సీఎల్ సంప్రదింపులు జరిపింది. ఈనెల 16 నుంచి అవసర మైన రేకులను అందుబాటులో ఉంచనున్నారు. తెలం గాణలో జూన్, జూలైలో 1లక్ష టన్నుల యూరియా సరఫరా చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. రెండు రోజులకు మూడు రేకుల చొప్పున సరఫరా కాను న్నది. మొదట ఆదిలాబాద్, నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలకు యూరియా సరఫరా చేయనున్నారు. ఈ జిల్లాల్లో పంటలు ముందుగా వేసే అవకాశం ఉండడంతో ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేస్తారు. రాష్ట్ర వ్యవసాయశాఖ కూడా ఎప్పటికప్పుడు ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యాన్నిసంప్రదిస్తుంది. ఇప్పటికే వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపిని రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి పంపింది. అదనపు కోటా కేటాయించాలని ఒత్తిడి పెడుతుంది. ఇప్పటికేనాట్లు వేసి సీజన్ మొదలవుతున్న పరిస్థితుల్లో రైతాంగానికి యూరియా కొరత ఆందోళన కలిగింది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి ప్రారంభవుతుండ డంతో ఊరట కలుగనున్నది.



ఆర్‌ఎఫ్‌సీఎల్

ప్రభుత్వ లక్ష్యం.. ఆరోగ్య తెలంగాణ

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



భీమారంలో ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భీమారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. త్వరలోనే భీమారం మండల కేంద్రంలో ప్రభుత్వ పక్కా భవనాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భీమారం మండల కేంద్రంలో బుధవారం రూ.కోటి 43 లక్షల నిధులతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం విప్ భూమి పూజ నిర్వహించారు. అనంతరం 97 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, 27 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నాయకులు బక్కూరి నరేష్, ఉత్కం శంకర్ గౌడ్, చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, అంగడి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిని ప్రారంభించిన విప్..

మేడిపల్లి, జూన్ 11: మేడిపల్లి మండలంలోని వల్లంపెల్లిలోని కాకతీయ కెనాల్‌పై రూ.2 కోట్ల 50 లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లంపల్లి వాసులు ఎదురు చూస్తున్న బ్రిడ్జి అందుబాటు లోకి రావడం సంతోషకరం అన్నారు. మేడిపల్లి మండల కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం తర గతులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విప్ సూచించారు. కార్యక్రమలో కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, బొంగోని రాజా గౌడ్, నాగరాజు, జలందర్, నవీన్‌రెడ్డి, గంగరెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలి

హుజూరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, రచయిత, గాయకుడు నేర్నాల కిశోర్ అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో ఈనెల15న కరీంనగర్‌లోని కళాభారతిలో ఉదయం 10నుంచి రాత్రి 10గంటల వరకు జరిగే పాటలపల్లకిలో కార్యక్రమ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక చాలామంది కళాకారులకు న్యాయం జరగలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కళాకారులను ఆదుకొని ఉద్యోగాలు కల్పించాలన్నారు.

380 రాజన్న కోడెల పంపిణీ

వేములవాడ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి గోశాలలోని కోడెల పంపిణీ కొనసాగుతుంది. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆధ్వర్యంలో బుధవారం అర్హులైన రైతులకు కోడెలను పంపిణీ చేశారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న రైతుల ధ్రువపత్రాలను పరిశీలించి అనంతరం 380 కోడెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజన్న కోడెలను పొందిన రైతులు కోడెల సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వ్యవసాయ పనులకు మాత్రమే కోడెలను ఉపయోగించుకోవాలని తెలిపారు. రైతులు పొందిన కోడెలు పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే కోడెల స్థితిగతులపై ఆరా తీస్తారని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి, పశువైద్యాధికారితో పాటుగా ఆలయ అధికారులు ఉన్నారు.



కోడెలకు దరఖాస్తు చేసుకున్న రైతుల పత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్

వైభవంగా గోవుల కల్యాణ మహోత్సవం

- ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

ఓదెల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి క్షేత్రంలో బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా వృషభ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వ హించారు. అధికసంఖ్యలో తరలివచ్చిన మహి ళలు మంగళహారతులతో, వేదమంత్రోచ్చరణలతో గోమాతలకు కళ్యాణాన్ని నిర్వహించారు. గ్రామం లోని ఆవు, దూడను పెళ్లికూతురుగా, పెళ్లికొడు కుగా వేషధారణతో అలంకరించి, మేళతాళాలతో ఆలయం వరకు శోభయాత్ర నిర్వహించారు. అనంతరం రెండింటికి పంచముఖ హనుమాన్ పీఠం పరబ్రహ్మ నందగిరి స్వామి సమక్షంలో వివాహ తంతును నిర్వహించారు. కల్యాణాన్ని గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు.



ఓదెల సీతారామచంద్రస్వామి ఆలయంలో గోవులకు కల్యాణాన్ని నిర్వహిస్తున్న నందగిరి స్వామి

● ఇంటికొక ఆవును పోషించండి..

- పరబ్రహ్మ నందగిరి స్వామి

గ్రామాలు, దేశం సుభిక్షంగా, సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటికొక పాడి ఆవు, గేదెలను పోషించుకోవాలని కరీంనగర్ పంచముఖ హనుమాన్ పీఠం పరబ్రహ్మ నందగిరి స్వామి అన్నారు. గోమాతల కళ్యాణ మహోత్సవం పూర్తి అనం తరం నందగిరిస్వామి మాట్లాడుతూ, గోవుల పంచమూత్రా లను ఎవరైతే ఉపయోగిస్తారో ఆఇంటిలో ఎలాంటి అనారోగ్యం దరిచేరదన్నారు. స్వచ్ఛమైన ఆవుపాలు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తా యన్నారు. కార్యక్రమంలో నల్ల ఫౌండేషన్ అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, అలాగే ఆర్‌ఎస్‌ఎస్, హిందువాహిని, చిరుతలరామాయణ భక్తబృందం, భ్రమరాం బిక సేవాసమితిసభ్యులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

కరీంనగర్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగులో రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటించి అధిక దిగుబడి సాధించాలని ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్ రావు అన్నారు. బుధవారం కరీంనగర్ మండలం తహెర్ కొండాపూర్, చామనపల్లి గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల, వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. హైదరాబద్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సువర్ణ, వేణుగోపాల్,ఎంఏవో సత్యం పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులకు అభిషేకం

కరీంనగర్ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యజ్ఞవరాహ క్షేత్రంలో బుధవారం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా రమాసత్యనారాయణస్వామి మూల, ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. ఎస్‌వీఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ పాల్గొన్నారు.

అంజనాద్రి ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 32వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. చిలకపాటి హనుమంతారావు, అర్చకుడు మంగళంపల్లి రామకృష్ణశర్మ పాల్గొన్నారు.

కన్నుల పండువగా పల్లకీ సేవ

కరీంనగర్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏరువాక (జ్యేష్ఠ) పౌర్ణమి సందర్భంగా బుధవారం కరీంనగర్ మండలం నగునూర్ శివారులోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో పల్లకీ, ఉయ్యాల సేవ నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి, వేద పండితుడు పురాణం మారుతిశర్మ, ఆలయ కమిటీ బాధ్యులు వంగల లక్ష్మణ్, వేములవాడ ద్రోణాచారి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన



గన్నేరువరం బడిబాటలో ఎంఈవో రామయ్య, ఉపాధ్యాయులు

భగత్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోందని కొత్తపల్లి ఎంఈవో ఆనందం అన్నారు. బుధవారం గ్రామంలో విద్యావాహిని ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు.

గన్నేరువరం: మండలంలో ఎంఈవో రామయ్య ఆధ్వర్యంలో బడిబాట చేపట్టారు.

మానకొండూర్: బడిబాటలో భాగంగా ఈ నెల11వరకు ఒకటో తరగతి నుంచి ఐదు వరకు 65 మంది, 6నుంచి 7వరకు 30మంది, 8నుంచి 10వరకు 27మంది నమోదు చేసుకున్నారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని సిర్సపల్లి బడిబాటలో తహసీల్దార్ కనకయ్య పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండి జడ్పీ బాలుర పాఠశాల ఆధ్వర్యంలో వెదురుగట్టలో హెచ్‌ఎం దామెర అశోక్ రెడ్డి, ఆర్నకొండలో యూటీఎఫ్ అధ్యక్షుడు ముల్కల కుమార్ బడిబాట చేపట్టారు.

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

హుజూరాబాద్: పట్టణంలోని వివేకానందనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భగత్‌నగర్: పద్మనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. రెండున్నర సంవత్సరాల పిల్లలను బడిలో చేర్పించాలన్నారు.

గణేష్‌నగర్: కోతిరాంపూర్-2 అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ప్రీస్కూల్‌కు సంబంధించి మెటీరియల్ ప్రదర్శించారు.

డాక్టర్ భూంరెడ్డికి ఘన నివాళి



భూంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు

సుభాష్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్యుడు డాక్టర్ భూంరెడ్డికి ఐఎంఏ బాధ్యులు ఘన నివాళులర్పించారు. బుధవారం భూంరెడ్డి కుటుంబ సభ్యులను కలిసి సంతాపాన్ని తెలిపారు. ఐఎంఏ సీనియర్ నాయకుడు డాక్టర్ విజయ చందర్‌రెడ్డి, డాక్టర్లు సుధాకర్ రెడ్డి, ప్రమీల, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నరేష్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బీఎన్‌రావు, మాజీ అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, కిషన్ ఉన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం ఎలబోతారంలో ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ భూంరెడ్డి సంతాప సభను నిర్వహించారు. గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు వొలం సుధాకర్‌రెడ్డి సంఘం సంయుక్తకార్యదర్శి దారం జగన్నాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

రైతన్న ఇంట పండుగ వాతావరణం వెల్లివిరియాలి

సుభాష్‌నగర, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏరువాక సందర్భంగా రైతన్నల ఇంట పండగ వాతావరణం వెల్లివిరియాలని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు అన్నారు. బుధవారం నగరంలోని కార్యాలయంలో మాట్లాడుతూ విస్తారమైన వర్షాలతో ప్రాజెక్టులు, చెరువులు నిండాలన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పంటలకు గిట్టుబాటు ధర వర్తింపజేయాలన్నారు. ఎరువులు, మందులు, యంత్ర పరికరాలకు సబ్సిడీలు అందించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేష్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-1 2 ఏడీఈలు శ్రీనివాస్‌గౌడ్, లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 వరకు శివనగర్, ప్రగతినగర్, టెలిఫోన్ క్వార్టర్స్ ఏరియా, లారెల్ స్కూల్, బతుకమ్మ కాలనీ, సప్తగిరి కాలనీ, ఉదయం 9 గంటల నుంచి 10.30వరకు అల్కాపురి కాలనీ, జేఎఎస్ బేకరి, శ్మశాన వాటిక, ఉదయం 7 గంటల నుంచి 10 వరకు హిందుపురి కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్, వర్క్‌షాపు ఎదుట ఏరియా, సువిద్య స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రేపు నీటి సరఫరా నిలిపివేత

కరీంనగర్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని హైలెవల్ జోన్ అంబేద్కర్‌నగర్ రిజర్వాయర్ పరిధిలోని బండ పోచన్న షాపు నుంచి గాంధీ రోడ్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్‌లో పైపులైన్ లీకేజీ మరమ్మతు కారణంగా శుక్రవారం పలు డివిజన్లలో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ ఈఈ ప్రకటనలో తెలిపారు. నగరంలోని 2, 3, 4, 5, 24, 25, 26, 27, 28, 42, 44 డివిజన్లలో తాగునీటి సరఫరా ఉండదని తెలిపారు.

మోదీ పాలనలో విశ్వఖ్యాతి

కరీంనగర్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పదేకొండేళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో దేశానికి విశ్వఖ్యాతి లభించిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ ఆధ్వర్యంలో జూబ్లీనగర్‌లోని శ్రీరామ కల్యాణ మండలపంలో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో చారిత్రక, సాహసోపేత నిర్ణయాలతో మోదీ ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. గంగాధర మాజీ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, మండల నాయకులు రమణారెడ్డి, గోపాల్, రమేష్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల పునర్విభజన శాస్త్రీయంగా చేపట్టాలి

కరీంనగర్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ డివిజన్ల పునర్విభజన శాస్త్రీయంగా చేపట్టాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు. బుధవారం ఆర్డీవో మహేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26, 28, 34, 36, 54, 45, 47, 43, 44 డివిజన్లను ఏ ప్రాతిపదికన ముక్కలు చేశారని, కేవలం ఎంఐఎం గెలవకూడదనే ఆలోచనతో చేపట్టారని మండిపడ్డారు.

భగత్‌నగర్: రేకుర్తిలో 18, 19 డివిజన్లను ఇంటి నంబర్లు, ఓటర్ల సంఖ్య, రహదారుల విస్తీర్ణం ఆధారంగా పునర్విభజన చేపట్టాలని కృషి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.

కరీంనగర్ టౌన్ : డివిజన్ల పునర్విభజన లోపభూయిష్టంగా ఉందని, వెంటనే పునఃపరిశీలనచేసి ఇబ్బందులు లేకుండా విభజన చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాజె రమేష్ కోరారు. బుధవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. 35వ డివిజన్ పునర్విభజన తాజా మాజీ కార్పొరేటర్ లబ్దిచేకూర్చేలా రూపొందించారన్నారు.

రేకుర్తి కంటి ఆస్పత్రికి ఐఎస్‌వో సర్టిఫికెట్లు



సర్టిఫికెట్ అందుకుంటున్న చైర్మన్ వేణుమూర్తి

భగత్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ మాడేకర్ రేకుర్తి కంటి ఆస్పత్రికి ఐఎస్‌వో సర్టిఫికెట్లు లభించాయి. బుధవారం ఆస్పత్రి ఆవరణలో హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఐఎస్‌వో సర్టిఫికెట్‌లను ఆస్పత్రి చైర్మన్ కొండ వేణుమూర్తికి అందజేసింది. ఎక్కువ సంఖ్యలో కంటి ఆపరేషన్‌లు, ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సర్టిఫికెట్లు అందజేశారు. సంస్థ అధినేత శివయ్య, లయన్‌కోల అన్నారెడ్డి పాల్గొన్నారు.

వాసవి ట్రస్టు ద్వారా ప్రతీ నెలా పేదలకు రూ.లక్ష వితరణ

కరీంనగర్ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పేద వర్గాల విద్యా, వైద్యం, వివాహం కోసం కరీంనగర్ వాసవి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతీ నెల లక్ష రూపాయాల సాయం అందించాలని నిర్ణయించినట్లు ట్రస్టు చైర్మన్ చిట్టిమల్ల శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదలు, అవసరార్థులు ట్రస్టు సభ్యులనుగానీ, 9246932525, 9849224517 నంబర్లలోగానీ ఈ నెల 13లోపు సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని, లేదా దరఖాస్తు రూపంలో సమర్పించాలని కోరారు. పరిశీలన అనంతరం ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. కార్యదర్శి రాజేశ్వర్, ఆర్ భద్రయ్య, సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి మృతి

కరీంనగర్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ మాజీ ఎంపీటీసీ కామిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (68) అనారోగ్య సమస్యలతో బుధవారం మృతి చెందారు. ప్రభాకర్‌రెడ్డి రాష్ట్రంలో మొదటి సారిగా మండలాలను ప్రతిపాదించినప్పుడు తెలుగుదేశం పార్టీ టికెట్ నిరాకరించడంతో ఇండిపెండెంట్ ఎంపీటీసీగా బొమ్మకల్ నుంచి గెలుపొందారు. గ్రామ ఉప సర్పంచ్‌గా కూడా పని చేశారు.

పైపులైన్ లీకేజీ.. పట్టించుకోని అధికారులు

కరీంనగర్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 19వ డివిజన్‌లో 15 రోజులుగా వాటర్ పైపులైన్ లీకేజీ అవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దుర్గం మారుతి ప్రకటనలో ఆరోపించారు. పైపులైన్ లీకేజీతో నల్లానీరు వృథాగా పోతోందని, కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కారానికి ఆదేశాలివ్వాలని కోరారు.

మున్సిపల్ కార్పొరేషన్ లైజన్ ఆఫీసర్‌గా రజనీష్



కరీంనగర్ లీగల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లైజన్ ఆఫీసర్‌గా న్యాయవాది భూక్య రజనీష్‌ను నియమిస్తూ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్‌కు చెందిన రజనీష్ జిల్లా కోర్టులో మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన కేసుల్లో లైజన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా న్యాయవాది రజనీష్ మాట్లాడుతూ నమ్మకంతో తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, తన నియామకానికి సహకరించిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, కరీంనగర్ లీగల్ సెల్ చైర్మన్ కల్లెపల్లి లక్ష్మయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. లీగల్ సెల్ జిల్లా కన్వీనర్లు శంకర్, నవాజ్, శ్రీకాంత్, మహేందర్, సీనియర్ న్యాయవాది మెట్టు అనిల్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

రేపు ఇసుక వేలం

కరీంనగర్ క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడిన ఇసుకకు శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు కరీంనగర్ తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో దాదాపు 30 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు 5 వేల రూపాయలు డిపాజిట్ చేయాలని, అత్యధిక వేలం పాడినవారికి ఇసుకను అప్పగిస్తామని తెలిపారు. ఇసుక వేలం పూర్తయిన తరువాత 24 గంటల్లో వేలం డబ్బులు చెల్లిచాల్సి ఉంటుందని, గడువులోగా డబ్బులు చెల్లించనట్లయితే డిపాజిట్ మొత్తం జప్తు చేస్తామని వివరించారు.

కల్యాణం.. కమనీయం



మంగళ సూత్రం చూపిస్తున్న అర్చకుడు

కరీంనగర్ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మంమకమ్మతోట వేంకటేశ్వరాలయంలో 15వ త్రయాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం భూనీళా సమేతవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం చేపట్టిన పల్లకీ సేవ కన్నుల పండువలా సాగింది. అర్చకుడు పీచర నరసింహచార్యులు మాట్లాడుతూ గురువారం సుదర్శన హోమం, పూర్ణాహుతి, ద్వాదశారాధన, ఏకాంత సేవ వంటి ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఆలయ వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్త శ్రీనివాస్-వినోద, ఈవో ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

భగత్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని చింతకుంట మన ఆదర్శ రైతు ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కొత్తపల్లి మండల వ్యవసాయాధికారి కృష్ణ మాట్లాడుతూ ఏరువాక పున్నమి అనాదిగా వచ్చే ఆచారమని ఇలాంటి పండుగ చేయడం అభినందనీయమన్నారు. డివిజనల్ వ్యవసాయాధికారి రణధీర్, మన ఆదర్శ రైతు ఉత్పత్తి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ న్యాల మడుగు శంకరయ్య, తెలంగాణ గ్రామీణ వికాస్ ప్రముఖ్ జిన్నా సత్యనారాయణరెడ్డి పట్టెం లక్ష్మీనారాయణ, సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్ : స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం శంకర్ ఆర్యాన్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సముద్రాల రాజమౌళి-ప్రణీతారాణి, కార్యదర్శి కోల అన్నారెడ్డి, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్యశిబిరాన్ని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

రామడుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండిగోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధారాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఉచితసమగ్ర వ్యాధి నిర్ధారణశిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా 110మందికి వివిధరకాల పరీక్షలు నిర్వహించామని అన్నారు. 12న వన్నారం, 13న గుండిలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌గ్రీష్మన్య,ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్‌మౌనిక,గ్రామస్థులు పాల్గొన్నారు.

వాయిదాపడ్డ మార్కెట్ పాలకవర్గ సమావేశం

జమ్మికుంట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సాధారణ సమావేశం కోరంలేక వాయిదాపడింది. బుధవారం మధ్యాహ్నం 3గంటలకు జరగాల్సిన సాధారణ సమావేశం డైరెక్టర్లు లేక వెలవెలబోయింది. మొత్తం 18మంది హాజరు కావాల్సి ఉండగా, చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్నతోపాటు ఇద్దరు డైరెక్టర్లు మాత్రమే హాజరయ్యారు. సమావేశానికి 15మంది డైరెక్టర్లు దూరం ఉండటం చర్చనీయాంశంగా మారింది. తమకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదనే ఉద్దేశ్యంతోనే డైరెక్టర్లు సమావేశానికి దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం సమావేశాన్ని వచ్చే బుధవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామడుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రామడుగు మోడల్ స్కూల్‌లో 6 నుంచి 12వతరగతి వరకు బోధించుటకు అర్హతగల ఉపాధ్యాయ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ ఒకప్రకటనలో తెలిపారు. పీజీ, బీఈడీతోపాటు టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పీజీటీ ఎకనామిక్స్-1, టీజీటీ తెలుగు-1, టీజీటీ హిందీ-2 పోస్టుఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు 16లోపు దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

వాగేశ్వరిలో విద్యార్థుల వీడ్కోలు వేడుక

తిమ్మాపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసీఏ విభాగం జూనియర్‌విద్యార్థులు, సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ప్రధానకార్యదర్శి గంద్ర శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానంచేశారు. అనంతరం విద్యార్థులు తమ సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ప్రకాశ్ రెడ్డి, వినోద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శంకరపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 11నుంచి సాయంత్రం 4:30గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆముదాలపల్లి ఏఈ రఘు తెలిపారు. కొత్తగా 33కేవీలింక్‌లైన్ వేయడంకోసం 33/11 కేవీసబ్‌స్టేషన్‌లో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. మొలం గూర్, ఇండస్ట్రియల్ ఏరియా, చింతలపల్లి, నల్లవెంకాయపల్లి, గుడాటిపల్లి గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు

మహిళా సంఘం అంటే ఒక నమ్మకం: కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సమేలా సత్పతి

తిమ్మాపూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘం అంటే ఒక నమ్మకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావివ్వకూడదని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలకేంద్రంలో నూతనంగా ఎన్నికైన గ్రామైక్య సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులకుతిమ్మాపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం నుంచి వస్తున్న వివిధరకాల పథకాలు ప్రతిమహిళకూ చేరేలా గ్రామ సంఘం పదాధికారులు పర్యవేక్షించాలని సూచించారు. దివ్యాంగులకు, 60నుంచి 65సంవత్సరాల లోపు వృద్ధమహిళలకు ప్రత్యేకసంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులను, దివ్యాంగులను కూడా సభ్యులుగా చేర్చుకునే బాధ్యత వీవోలపై ఉందని అన్నారు.

ప్రతి సభ్యురాలు బుక్ కీపింగ్, అకౌంటింగ్ వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సభ్యులు తమ పిల్లలందరినీ అంగన్‌వాడీకేంద్రాల్లో, ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంద్వారా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వెళ్లి ఉచిత వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, ఏపీఎం రాంమ్మోహన్, గ్రామైక్యసంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో స్పాట్ అడ్మిషన్లు

ఇల్లందకుంట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో 6వతరగతి నుంచి పదోతరగతితోపాటు ఇంటర్మీడియట్‌లో చేరుటకు ఈనెల12,13వతేదీల్లో స్పాట్‌అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అయిలయ్య తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఉదయం 10:30గంటలకు పాఠశాలలో హాజరుకావాలని పేర్కొన్నారు. 9వ, పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ప్రత్యేకహాస్టల్ సౌకర్యం ఉందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్షాలు కురవాలని గ్రామదేవతలకు పూజలు

శంకరపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కన్నాపూర్‌లో వర్షాలు కురవాలని రైతులు, గ్రామస్థులు గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బిందెలతో నీటిని తీసుకొచ్చి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు మెండుగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్య రక్షణకు కృషి చేయాలి

గంగాధర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య రక్షణకు శానిటేషన్ సిబ్బంది కృషిచేయాలని ఎంఈవో ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి మండల వనరుల కేంద్రంలో ఒక్కరోజు శిక్షణకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పరిశుభ్రత ప్రమాణాలు, వ్యర్థాలను తొలగిస్తూ విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. ప్రాక్టికల్‌గా శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్పీలు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా: ఎమ్మెల్యే సత్యనారాయణ



కొత్తగట్టులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మత్స్యగిరీంద్రస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం శంకరపట్నం మండలంలోని కొత్తగట్టుగ్రామంలోని మత్స్యగిరీంద్రస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయచైర్మన్‌గా కోరెం రాజిరెడ్డి, ధర్మకర్తలుగా తాడిచర్ల తిరుపతి, ఎడ్ల తిరుపతి, రామగిరి తిరుమల, రత్నం, లక్ష్మణరావు, రవీందర్‌లతో ఈవో సుధాకర్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, దేవస్థానం మాజీ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, గట్టు తిరుపతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

శంకరపట్నం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 79మంది లబ్ధిదారులకు రూ.29.49లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు.

సాంకేతిక పద్ధతులతో అధిగ దిగుబడులు సాధించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లావ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మి, తదితరులు

శంకరపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని మెట్‌పల్లి, మొలం గూర్ గ్రామాల్లో జమ్మికుంట కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అధిగమించి అధికదిగుబడి సాధించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ మహేష్, ఏడీఏ శ్రీధర్, ఏవో వెంకటేష్, ఏఈవోలు కీర్తన, తిరుపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

ఇల్లందకుంట: మండలకేంద్రంలో రజకుల ఆరాధ్యదైవమైన మడేలేశ్వరయ్య బోనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకొని మడేలేశ్వరయ్యకు నైవేద్యం సమర్పించారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ ఏసీపీ మాధవిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బుధ వారం స్థానిక నాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: మండలాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లిలో 90దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ కనుకయ్య తెలిపారు

గంగాధర: మండలం నారాయణపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 81 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ అనుపమ తెలిపారు.

ఇల్లందకుంట: మండలంలోని మల్యాలలో 181దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ రాణి తెలిపారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని వీలిన గ్రామాలైన ధర్మారం, కొత్తపల్లి,రామన్నపల్లి గ్రామాలను అభివృద్ధిలో ముందుంచుతామని కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. బుధవారం వందరోజుల ప్రత్యేక ప్రణాళికలో ఆయా ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు.

తిమ్మాపూర్: గొల్లపల్లిగ్రామంలో ముగ్గురులబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బుధవారం ముగ్గు పోసుకున్నారు. 12ఏళ్ల తమకల నేరవేరుతోందని లబ్ధిదారులు ఆనందంవ్యక్తం చేశారు.

చొప్పదండి:రుక్మాపూర్‌లో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకుమేలైన సాగుపద్ధతులపైశాస్త్రవేత్తలుఅవగాహన కల్పించారు.

-ప్రధానిగా మోదీ మూడోసారి, కేంద్ర మంత్రిగా బండి సంజయ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేసి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్నకొండలో బీజేపీ నాయకులు సంబరాలను నిర్వహించారు. టపాసులు కాల్చి, స్వీట్లను పంపిణీ చేశారు.

గంగాధర: గంగాధర ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లపై ఎంపీడీవో రాము సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకు నేందుకు ప్రోత్సహించాలని, బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇళ్లకు బిల్లులు చెల్లించే విధంగా చూడాలని అన్నారు.